2)

# కళ్ళజోడు

ఏక్షణాని కేం జరుగుతుందో ఎవ్వరూ చెప్పలేరు. అలాచెప్పగలిగే సదుపాయ మేదన్నా ఉన్నట్లయితే, శారద బ్రతుకు ఇలా అయిఉండదు. అంతమాత్రాన ఈ క్షణాన శారద కొచ్చిన లోటేమీ లేదు. తల్లీ తండ్రీ సలక్షణంగా ఉన్నారు. ఒక్కతే కూతురు గావడంతో, గారాబమైన పెంపకం ఉంది. వెనక బోలెడంత ఆస్తివుంది. పైగా చదువు సంధ్యలుగూడా ఉన్నాయి. ఏ బ్యూటీకంటెస్టులోనో పాల్గొంటే శారద నెగ్గకపోవచ్చు గాని చక్కనిదనడాని కెవరూ ఆక్షేపించనక్కరలేదు.

అయితే ఏమయినట్టు కనక! అంగడిలో అన్నీ ఉన్నాయి. అల్లుడినోట్లో మాత్రం శనిగాడు పీఠంపెట్టాడు. ఒకప్పుడైతే ఈలోటును ఒకరు ఆర్చేదీకాదు, తీర్చేదీకాదు! కానీ కాలం మారిపోయింది. పది సంవత్సరాల క్రిందట, ఊహించనన్నా ఊహించలేని ఎన్నో సంఘటనలు ఈనాడు కళ్ళముందు ప్రత్యక్షమౌతున్నాయి. నిన్న కానే కాదను కొన్నది కాస్తా, ఇవ్వాళ అయికూచుంటున్నది. ఈ దృష్ట్యా చూస్తే శారదకు మళ్ళీ పెళ్ళిచెయ్యడం, ఆటే అబ్బుర పడవలసిందికాదు. కాకపోగా, అలాచెయ్యడమనేది, సాంఘిక ధర్మాన్ని పాటించడమంటే అపరాధమా ఏమిటి?

కాదని సాంబయ్యకు తెలుసు. కావటానికి ఆయన పూర్వాచారపరాయణుడేను. ఇప్పటికీ ముప్పొద్దులా సంధ్య వారుస్తాడు. పట్టుబట్ట కట్టిగాని, ఔపోసన పట్టడు. మళ్ళీ కాంగ్రెసంటే వల్లమాలిన అభిమానం ఉంది. రాజకీయాలంటే చెవికోసుకొంటాడు. ఒకరకంగా చెప్పాలంటే ఆయన పాతతరంలో అతివాది. కొత్తతరంలో మితవాది.

మనం 'మారాలి మారాలి' అని ఊరికే అరుస్తాంగాని, అరవడంవల్ల ఎంతమేరకు మారుతుందనేది యోచించం! ఏ మార్పు రావాలన్నా ఆ మార్పు వచ్చేందుకు కావలసిన పరిస్థితులు చుట్టూ ఉండాలి. మన్ని ముసిరిన వాతావరణం, మనం మారేందుకు ఒత్తిడిచేయాలి. అంతదాకా మన మసలు మార్పుకావాలని కోరం. మనం కోరకుండానే ఆ మార్పు వస్తే సహించం!

సాంబయ్యగారికూడా, ఆమధ్యదాకా, ఆడవాళ్లు చదువుకోడమంటే కిట్టేదికాదు. వంటగదిలో మగ్గవలసిన ఆడముండలకు చదువు బొత్తిగా అనవసరమని ఆయనగారి విశ్వాసం! ఈ విశ్వాసాన్ని, ఆయన అనేకసార్లు బైట పెట్టిన నిదర్శనా లున్నాయి. అలా బైటబెట్టి నలుగురిచేతా 'సెహబాష్' అనిపించుకొన్న రోజులూ ఉన్నాయి!

పట్టుమని పది సంవత్సరాలు గడవలేదు. సాంబయ్యగారి విశ్వాసాలు క్షుద్రవిశ్వాసాలని తేలిపోయింది. వాటికి బొత్తిగా విలువలేదని, ఆయనగ్రహించాడు. ఇలా గ్రహించడానికి శారద ఎంతగానో తోడ్పడింది. కొంతమంది క్షోభ పడటంతోగాని, ఒక్క పరిణామం కలగనిమాట నిజమే

అయితే, సాంబయ్యగారిలో కలిగిన ఈ పరిణామానికి శారద సంక్షోభమే కారణమని, మనం అంగీకరించాలి.

కావాలని శారదగాని, మరొకరుగాని, ఎలాంటి సంక్షోభమూ కలిగించలేదు. శారద జీవితాన్ని పర్యాలోకించిన తరువాత, అంతకన్న చేయగలిగిందేమీ లేదు కనుకనే, ఆయనగారీ మార్పుకు అంగీకరించాడు. ఇలా అంగీకరించవలసిందిగా ఆయన్నెవ్వరూ బలవంతపెట్టలేదు.

ఒకరోజున, శారద పొరుగింటికెళ్ళిన సందర్భంలో సాంబయ్యగారు, తన మనసులో అనుకొన్నదాన్ని గురించి, భార్యతో సంప్రదించారు. ఆమెగారు అంతా విని, తడైన కళ్ళను, పమిటతో వత్తుకొంది.

'ఏం మాట్లాడవేం?' అన్నాడు సాంబయ్య, తను గూడా వస్తున్న దుఃఖాన్ని అణిచి పెట్టుకొంటూ.

'నాకేమీ తెలియదు. మీ ఇష్టంవచ్చినట్టు చెయ్యండి. ఎంత చదువు చెప్పించినా, ఎన్ని సొమ్ములు తగిలించినా, మొగుడు లేని లోటును తీర్చలేము.'

'కాబట్టి?' అని రెట్టించాడు సాంబయ్య.

'ఏమీ లేదు. మీ మాటకు ఏనాడు ఎదురుచెప్పాను గనక ఇవ్వాళ కాదంటాను? అప్పుడే నేను చెప్పినట్టు విన్నట్టయితే, దానిరాత ఇలా బద్దలయి ఉండకపోను. కాదు కూడదంటున్నకొద్దీ, అయివాళ్లు - అయినవాళ్లు, అంటూ దాన్ని హతమార్చారు. ఇవ్వాళేదో, దానినెత్తిన పాలుపొయ్యబోతున్నట్టు మాట్లాడుతున్నారు. సరే కాని

వ్వండి! అలాగే చదివించండి! ఎన్ని చదివించినా, దాని కా లోటు తీర్చగలమా ఏమన్నానా" అన్నది పూర్ణమ్మ.

సాంబయ్యగారేమీ మాటాడలేదు. తనలో తనేదో గొణుక్కున్నాడు. కొంచెంసేపు కళ్ళుమూసుకొని కుర్చీలో జారగిలబడ్డాడు. అంతలోనే ఆయనకళ్ళు నీటితో నిండి పోయాయి. ముఖం, విచారభారంతో ఎఱ్ఱబడ్డది. అప్రయత్నంగా పెదవులు కంపించాయి.

మానవుడు చేసే, ఒక్క చిన్నపని—అందునా సద్బుద్ధితో చేసింది—ఒక్కో సందర్భాన ఎంతటి విషఫలితాల నిస్తుందో చెప్పటం అసాధ్యం! సరిగ్గా పది సంవత్సరాల క్రిందట — ఆయన భార్యమాట విన్నట్లయితే, ఈ రోజున ఇలా విచారపడవలసిన అవసరం ఆయనకు కలిగేదికాదు. ఆనాడు భార్య ఎంతగానో చెప్పింది. తనకు తెలిసిన నలుగురిచేతా చెప్పించింది. సాంబయ్య వినలేదు. ఎవరెన్ని చెప్పినా విననన్నాడు. 'ఒకరు చెప్పి నన్ను మార్చాలని చూడటం అసంభవం' అన్నాడు. శారదను తన మేనల్లుడికి ఇచ్చి చెయ్యవలసిందే నన్నాడు. ప్రపంచమంతా ఏకమైనా తన నిర్ణయం మారబోదన్నాడు.

నిజానికి సాంబయ్యగారు పరిస్థితుల్నిబట్టి నడుచుకొనే స్వభావం గలవాడు. అయినప్పటికీ-ఇలా పట్టుబట్టటానికి చాలా కారణాలున్నాయి. తనచెల్లెలిసంసారం అట్టే ఉన్న దేమీ కాదు. తన బావగారు బ్రతికున్న రోజుల్లోనే, నానా

బాధలూ పడటం జరిగేది. ఆ సంగతి తనకు తెలుసు. అందుకే చాటునా, మాటునా ఏదో సాయంచేస్తూండేవాడు. ఖర్మకాలి ఆయన కాస్తా దాటిపొయ్యాడు. ఆ కుటుంబం నడివీధిలో నిలబడ్డది. అన్నగానే గాక, భూతదయతోనే, తనా కుటుంబానికి సాయపడ్డాడు. కాని ఇలా ఎంతకాలం? చూస్తూ, చూస్తూ, ఒక కుటుంబాన్ని జీవితాంతం పోషించడ మంటే మాటలా? ఎంతకాలమని వాళ్ళను తను పోషిస్తాడు? అదీగాక, ఒక్క పోషణతోనే జరగదు. రేపు కిష్టిగాడికి చదువుసంధ్యలు చెప్పించాలి. అందుకోసం బోలెడంత తను ఖర్చుపెట్టవలసి ఉంటుంది. ఖర్చుపెట్టాలిగదా అని మానేస్తే, వాడు ఎందునా కాకుండా పోతాడు. అటు ఆస్తీ లేక, ఇటు చదువూ లేక, వాడేమయ్యేట్లు? అట్లాగని మేనల్లుడిమీద, వేలకువేలు పెట్టుబడి పెట్టటానిక్కూడా మనస్సొప్పదు. మరో పదేళ్ళకు శారద ఎక్కిరావచ్చు. అప్పుడైనా తను దానికి సమాధానంచెప్పవలసి ఉంటుంది!

ఇవన్నీ ఆలోచించే సాంబయ్యగారు, కిష్టిగాణ్ని చేర దీశాడు. వాడికి చదువు సంధ్యలు చెప్పించాడు. వాడింకా స్కూలు ఫైనలు చదువుతుండగానే, పెళ్ళిప్రసక్తి తీసు కొచ్చాడు. అప్పటికి శారద ఆరో తరగతి చదువుతోంది!

'అయినా ఇప్పుడేం తొందర?' అని చాలామంది ఆయనకు సలహాలిచ్చారు.

ఆ సలహాలను సాంబయ్యగారు పాటించలేదు. కూతురు, రోజురోజుకూ రెపరెపా యెదుగుతున్నది. చదివి నంతవరకూ చదివింది. ఆ మాత్రం చాలు. రజస్వలా

నంతర వివాహాలు తన ఇంటావంటా లేవు. ఆ అప్రాచ్యపు పని త నెన్నడూ చెయ్యడు. ఇంకోరు చేస్తున్నా తను సహించ లేడు.

ఎప్పుడో ఒకప్పుడు విధిగా కావలసిన ఈ పెళ్ళి, ఇప్పుడే అయినందువల్ల నష్టమేమిటో సాంబయ్యకు ఎంత ఆలోచించినా స్ఫురించలేదు. కాకపోగా, ఎన్నో లాభాలు గూడా ఉన్నాయనుకొన్నాడు. ఒకటి: తను కూతురు పెద్ద మనిషయినాక పెళ్ళిచెయ్యటమనే బెడద తప్పుతుంది. రెండు కిష్టిగాడికీ తనకూ మధ్య, ఇంకా దగ్గరిసంబధం ఏర్పడు తుంది. ఇప్పుడైతే, మేనల్లుడిక్రింద వందలు ఖర్చుబెడుతు న్నందుకు, తన భార్య ఏడుస్తోంది గాని, అప్పుడైతే నోరు మెదపనా? ఉన్నదంతా వాళ్ళిద్దరిదేనాయె! వాళ్ళ సొమ్ము పెట్టి వాళ్ళే చదువుకొంటారు. సానబట్టుకొంటారు. అప్పుడు తన ప్రమేయమంటూ ఉండబోదు. 'అయ్యో' అని తన అంతరాత్మగూడా గోలపెట్టదు.

ఇందువల్ల కిష్టిగాడు చదువు మానవలసిన అవసరం మట్టు కెక్కడిదీ? పెళ్ళాడాక చదవగూడదా యేం? అయినా చదవకుండా, ఈ భడవా చేసే నిర్వాకంమట్టు కేముంది గనకా? ఆ నాలు గక్షింతలూ నెత్తినవేసి వాణ్ని కాస్తా గుంటూరు తరిమేస్తాడు. నాలుగేళ్ళల్లో బియ్యేకొస్తాడు. ఈలోపుగా కాస్త మంచిలగ్గం చూచుకొని, ఆ కాస్త అడ్డంకీ తీర్చేస్తే తన కిక నిశ్చింతగా ఉంటుంది. అదృష్టవంతుడై ఎక్కడన్నా ఉద్యోగంచేసుకొన్నా మాభాగ! లేదా ఇంటి పట్టునే ఉండి వ్యవసాయంచేయించినా మాభాగ!

భగవంతుని దయవల్ల ఇలా జరగాలని సాంబయ్యగారి కోరిక. కాని అది పూర్తిగా నెరవేరలేదు. పెళ్ళయిన రెణ్నెల్లకు కృష్ణమూర్తి గుంటూర్లో చదువు సాగించాడు. చదువు సాగించిన రెణ్నెల్లకు గుంటూరునుండి పీఠం ఎత్తేశాడు.

వాడికోసం సాంబయ్యగారు చాలా ప్రయత్నాలు చేశారు. చాలామంది మనుష్యుల్ని, చాలా ప్రాంతాల తిప్పాడు. వరసాగ్గా మూడునెలలపాటు పత్రికల్లో ఫొటోతో సహా ప్రకటనచేయించాడు. కాని ఎలాంటి ఫలితమూ కనిపించలేదు. ఎప్పుడో ఒకప్పుడు వాడు తిరిగి ఇంటికి వస్తాడని సాంబయ్యగారు అనుకొంటుండేవారు. ఏళ్ళు గడుస్తున్న కొద్దీ, వాడు తిరిగివస్తాడన్న నమ్మకంగూడా క్రమంగా అంతరించసాగింది.

ఎలాంటి సంఘటన నయినా తట్టుకోగల సాంబయ్యగారు, ఈ దెబ్బకు తట్టుకోలేకపోయారు. ఏదో మహాపరాధం చేసిన దోషిలాగా ఆయన తనలో తనే కుమిలిపోతుండే వాడు. తను చేసిన ఒక సత్కార్యం, యెంతటి దారుణంగా పర్యవసించిందో ఆయన తలంపుకొచ్చినప్పుడల్లా, మనిషికి వెర్రి చూపులు పడేవి. ఒక్కొ సందర్భంలో, గంటలకు గంటలు, అలా శూన్యంలోకి చూస్తూ ఉండి పోయేవాడు. కొంతకాలం ఆయన వీధికేసిగూడా వచ్చేవాడు కాదు.

సాంబయ్యగారు ఇంత సంక్షోభపడుతున్నా, శారదకు ఆయనపట్ల సానుభూతంటూ లేదు. అథవా ఏదయినా ఉంటే, అది తండ్రిపట్ల చూపే మేరకే ఉండిఉంటుంది. తనను గురించి, తన అమ్మా నాన్నా పడే వేదనలో, ఏదోవంతు

శారద పడలేదు. పడటంలేదని శారదకూ తెలుసు. అనేక సార్లు, యెందుకా అని ఆవిడ ఆలోచించనుగూడా ఆలోచించింది. సరైన కారణమనేది శారదకు తట్టలేదు.

ఏ అనుభూతి కానివ్వండి, అది ఉట్టినే కలగదు. పుల్లయ్య సంతోషించే ప్రతి దానికీ ఎల్లయ్య సంతోషించడు. సూరక్కకు విచారం కలిగించే సందర్భం, సుబ్బక్కకు విచారం కలిగించదు. వేదాంతుల భాషలో చెప్పాలంటే, అసలు విచారానికి కారణ మేమిటంటారు? ఆశ. ఆశావాదికే నిరాశ అనేది కలుగుతుంది. ఆశను జయించినవాడికిఏ గుడ్డూ లేదు. అందుకే మన మహర్షులు 'ఆశాపాశాలు తెంపుకోండర్రోయ్' అని నెత్తి నోరూ కొట్టుకొని చెప్పారు. అది విన్నవాళ్ళు తరించారు. వినని సాంబయ్యలాంటివాళ్ళు, నానా గడ్డీ కరుస్తున్నారు.

సాంబయ్యగారు ఆశావాది. ఆయన శారదను గురించి, చాలా చాలా ఆశించాడు. వాళ్ళ జీవితం మూడుపువ్వులూ, ఆరు కాయలుగా ఉండాలని కలలు కన్నాడు. ఆయన కలలన్నీ కరిగి పోయాయి. ఆశలు పేలిపోయాయి. అంచాతనే సాంబయ్యగారు ఇంతగా మధనపడవలసివచ్చింది. శారదకీ బెడదేమీ లేకపోవడానికి కారణం, ఆవిడ దేన్నిగురించీ పెద్దగా ఆశించలేదు.

పెళ్ళినాటికి శారదకు పదేళ్ళు దాటలేదు. అప్పట్లో ఆమెకు ఆశించవలసిందేమీ లేకపోయింది. తీరా ఏదో ఆశిద్దామనుకొనేసరికి, ఆ ఆశించవలసిందేదో, తనకు అందనంత దూరంలో ఉండిపోయింది. ఆవిడ ఆనాడు కలలు

కనలేదు. ఆ సమయం వచ్చేసరికి, కలలుకనడం అనవసరమన్న సత్యం తేలిపోయింది. ఏవిధంగానైతేనేంగాక, ఆశను దరిదాపుల్లోకి రానివ్వకపోవడంచేతనే, శారదకు విచారమనేది, అంతగా లేకపోవడానికి కారణమని సరిపెట్టుకోవలసి వస్తున్నది!

పూర్ణమ్మగారన్నట్టు—శారద జీవితంలో ఏర్పడిన ఈ లోటు మరొకరు తీర్చేదికాదు. అక్కడికీ ఉండబట్టలేక సాంబయ్య ఒకటి రెండుసార్లు ద్వితీయంగురించి భార్యదగ్గర ప్రస్తావించాడు. ఆవిడైతే అంగీకరించిందిగాని, శారద ఒప్పుకోలేదు; పెళ్ళంటేనే శారదకు వమనం వచ్చినంత పని అవుతోంది. తన ప్రయత్నాలన్నీ ఇలా విఫలమయ్యాక, చెయ్యవలసిందేమిటో సాంబయ్యకు పాలుపోలేదు.

ఒకనాడు సాంబయ్యగారు యాదాలాపంగా పత్రిక తిరగేస్తున్నాడు. ఓ బొమ్మమీద ఆయన చూపులు నిలబడ్డాయి; ఆ బొమ్మ ఎందుకో ఆయన దృష్టిని ఆకట్టింది. కళ్ళజోడు తుడుచుకొని, పత్రికను కళ్ళదగ్గర పెట్టుకొని చూశాడు. ఆయన నుదురు ముడతలుపడ్డది. ఏదో జ్ఞాపకం మనస్సులో మేలుకొన్నవాడిలా కంపించాడు. తన అనుమానాన్ని రహితంచేసుకొనేందుకు భార్యను కేకేశాడు.

'ఎందుకు?' అన్నది భార్య.

'మాట' అన్నాడు సాంబయ్య వణికిపోతూ. 'ఈ బొమ్మ చూడు! ఈ ముఖం మన మెక్కడో చూచినట్టు లేదూ?'

పూర్ణమ్మ అనాసక్తంగానే ఆబొమ్మకేసిచూసింది. ఆ ముఖం తను బాగా యెరిగినవాడిముఖంలాగే ఉన్నది. ఆ మీసాలు లేకుండాఉండి, రవంత వయస్సు తక్కువగా గనక ఉన్నట్లయితే, అది కిష్టిగాడి బొమ్మేనని పొరబాటుబడేందుకు బోలెడంత అవకాశంఉంది!

'ఆఁ దానికా అదృష్టం గూడానా?' అన్నదిపూర్ణమ్మ కళ్ళొత్తుకొంటూ—

సాంబయ్య ఇంకోసారి, బొమ్మకేసి పరిశీలనగాచూసి, పేపరుమడిచి తొడమీద పెట్టుకొన్నాడు.

'ఏమో చెప్పలేం! దానిరాత బాగుపడిందేమో మనకేంతెలుసు? బొమ్మ అచ్చగా కిష్టిగాడిలాగానేఉంది. కిందిపేరుగూడా వాడిదే!' అన్నాడు సాంబయ్య, ఇంకోసారి పత్రికలోకి చూసి. 'వీడేదో ఘనకార్యంచేశాట్ట! ఆ పత్రిక వాళ్ళు వీడిబొమ్మవేశారు.'

పూర్ణమ్మ ఏమీమాట్లాడలేదు.

'ఆపత్రికవాళ్ళకు ఉత్తరంరాస్తాను, వీడి అడ్రసు పంపమని, ఏమంటావ్?' అన్నాడాయన భార్యకేసితిరిగి.

'రాయండి' అన్నది పూర్ణమ్మ పత్రికవేపు చూస్తూ.

ఆరాత్రి సాంబయ్యకు నిద్రపట్టలేదు. ఏవేవోఆలోచనలు ఉసుళ్ళలా చెలరేగాయి. చాలారాత్రివరకూ అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాడు.

ఎన్నడూలేనిది, శారదగూడా ఆరాత్రి సరిగ్గా నిద్ర పోలేదు. కొన్నివందలసార్లు ఆబొమ్మకేసి చూసింది. అవ్యక్తమైన సంవేదనలేవో, ఆమెలో ఉవ్వెత్తుగా లేచాయి. అన్నీ

కలిసివచ్చినట్లయితే, తనీ వ్యక్తితో కాపరంచేస్తూఉండవల సింది. తనతోటివారిలాగా, తనూ బిడ్డలతల్లయి, వారి ముద్దు మురిపాలుచూస్తూ, ఆనందించవలసింది. భగవంతుడు తన కా అదృష్టంలేకుండా చేశాడు.

ఆ క్షణాన, తనజీవితం ఎందుకూ కొరగానిదిగా శార దకుతోచింది. తన బ్రతుకంతా ఎడారిలా అయిపోయిందని ఆమె బాధపడ్డది. అమేయ సౌఖ్యసంచయంమధ్యఉంటూ, తను దాన్ని పొందలేకపోయింది! జీవితంలో ఇంతకంటే దారుణ మింకేదైనా ఉంటుందా?

శారద ఆబొమ్మకేసి మరోమారు చూసింది. కళ్ళు బాష్పపూరితాలయినాయి. అనంతమైన భక్తితో ఆబొమ్మను కళ్ళకు అద్దుకొంది శారద.

★

ఏక్షణానికేం జరుగుతుందో ఎవ్వరూ చెప్పలేరు. అలా చెప్పగలిగే సదుపాయమే ఉన్నట్లయితే, గోపాలం, ఆనాడా పని చేసిఉండకపోను; అదయినా తను కొడుకుమీాది కోపంతో చెయ్యలేదు; వాడి జీవితం బాగుపడాలనీ, అందరి బిడ్డల్లాగా తనబిడ్డా, తన కింత పేరు ప్రతిష్ఠలు ఆర్జించాలనీ తను ఆశించాడు. తన ఆశలన్నీ అడియాసలయ్యాయి. తను అనుకొన్నది ఒక్కటీ జరగలేదు.

ఇన్ని సంవత్సరాల తర్వాత, గడిచిన, తనజీవితాన్ని ఒక్కసారి పర్యాలోకనం చేస్తుంటే, గోపాలానికి యెందుకో చెప్పరాని భయంవేసింది. ఆరోజులే వేరు, ఆకాలమే వేరు! కొత్తగా ట్రైనింగ్‌ప్యాసయి మేష్టరీ వెలిగిస్తున్నాడు. అమ్మా నాన్నా, కులమింటి కోతిని తెచ్చి, గోపాలానికి మూడుముళ్లూ వేశారు. గోపాలానికి అంతక్రితందాకా, ప్రేమనుగురించి తెలియదు. దాన్ని తెలియజేసే సాహిత్యంకూడా అతనంతగా చదవలేదు. అయితేమట్టుకేం, గోపాలం మనస్ఫూర్తిగా శేషమ్మను ప్రేమించాడు. ఆమెనుచూచి అతను యెంతగానో మురిసిపోయాడు. శేషమ్మగూడా తనభర్తను యథాశక్తి సుఖపెట్టింది.

వేరింటికాపురం పెట్టాకగూడా గోపాలంజీవితం చాలా కాలం దిగులూచింతా లేకుండానే గడిచింది. నిజంగా అతనికి కష్టకాలం ప్రారంభమైంది కృష్ణమూర్తిపుటకలనించీనూ! అంతదాకా ఒడిదుడుకులులేకుండా గడిచిన ఆ సంసారం, కృష్ణమూర్తి పుట్టినప్పట్నుంచీ, నానా ఇబ్బందులూ పడవలసివచ్చింది! ఎక్కడెక్కడి డబ్బూ, వాడికే చాలటం లేదు. గోపాలం తన ఖర్చులు చాలాభాగం తగ్గించుకొన్నాడు. శేషమ్మగూడా చాలా పొదుపుగా సంసారాన్ని గడపసాగింది.

'బిడ్డలులేకపోతే, లేరో అని గోలపెడతాం. ఉంటే ఇవీగొడవలు. నన్నడిగితే మనిషికున్న ఆర్థికబలాన్నిబట్టి,

పిల్లన్ని కనడం మంచిదంటాను. తినడానికి మెతుకులులేని వాడికి, పిల్లల్ని కనేహక్కు ఉండగూడదు,' అనుకొన్నాడు గోపాలం.

రోజులు రానురాను కఠినంగా తయారవుతున్నాయి. అన్నివస్తువుల ధరలూ మండిపోతున్నాయి, కాని గోపాలం సంపాదనేమీ పెరగడంలేదు. వచ్చేజీతంచాలక, సరిపడేటంత సంపాదించలేక గోపాలం నలిగిపోయాడు.

పుణ్యాంకొద్దీ పురుషుడు, దానంకొద్దీబిడ్డలు అంటారు. ఈ మాట గోపాలంపట్ల అక్షరాలా సత్యమయికూచుంది. అతను పూర్వజన్మలో యెంతోపాపం చేసుకునిఉండాలి. లేకపోతే కృష్ణమూర్తిలాంటి కొడుకు అతనికి కలిగిఉండడు.

ఆర్థికంగా యెన్నిబాధలున్నా గోపాలం సహించాడు గానీ, తనకొడుకు తుంటరిచేష్టలను అతను సుతరామూ భరించలేకపోయాడు. వాడో రాలుగాయివెధవయ్యాడు. అక్షరంముక్క వంటబట్టలేదు. చదువుకోరా అంటే చదువు కోడు. గట్టిగాకోప్పడితే, యెలానో పారిపోతాడు. ఆ పోయిన పోవడం, రాత్రికిగానీ తిరిగి కొంపచాయలకు రాడు.

వాణ్ణి అదుపులోపెట్టేందుకు గోపాలం చెయ్యవల సిన పనులన్నీ చేశాడు. లోలోపల యెంతగా అసహ్యించు కొన్నా, పైకి యెంతో ప్రేమను ప్రదర్శించాడు. కోరినవన్నీ కొనిపెట్టాడు. గొప్పగొప్పవారి కథలను చదివి వినిపించాడు.

కృష్ణమూర్తి అన్నింటినీ వినేవాడు. ఇక్కణ్నుంచీ సక్రమంగానే ఉంటాననేవాడు. ఆ మెరమెచ్చుమాటలకే

గోపాలం హృదయం పొంగిపొయ్యేది. ఆప్యాయంగా కొడుకును దగ్గరకు తీసుకొని గుండెలకు ఒత్తుకునేవాడు.

ఒకసారి గోపాలం, చిరిచాపమీదకూచుని, జంధ్యాలు వడుకుతున్నాడు. తల్లి, కృష్ణమూర్తి జేబులోంచి ఏవో తీసి, దాయడం, అతనికంటపడింది. జంధ్యాలువడుకుతున్నవాడల్లా తలెత్తి 'ఏమిటే అవి?' అన్నాడు గోపాలం.

'ఏమీలేదు' అంటూనే శేషమ్మ అక్కణ్నుంచి తప్పుకెళ్ళడానికి చూసింది.

తన కొడుకేదో ఘోరతప్పిదంచేశాడనీ, భార్య దాన్ని దాయడానికి తంటాలుపడుతోందనీ, గోపాలంగ్రహించాడు. అతని కెక్కడాలేని కోపంవచ్చింది. చివాలునలేచి, ఆవిడ గుప్పెటను విప్పిచూశాడు. కాల్చినవీ కొత్తవీ కలిసి, నాలుగైదు బీడీలు కనిపించాయి. కాసిని అగ్గిపుల్లలూ, ఒక సీమ సున్నంముక్కా కూడా ఆ గుప్పెటలో ఉన్నాయి.

'ఇంకా దాస్తావెందుకు? పదేళ్ళ కేనీకొడుకు పెద్దమొనగాడయ్యాడు. అప్పుడే బీడీలుతాగడం మొదలెట్టాడు. ఇంకా నాలుగురోజులకు ముండల్నిగూడా మరుగుతాడు,' అన్నాడు. గోపాలంభగ్గున మండిపడుతూ.'వాణ్నిక కొంపలోకి రానివ్వబోకు. వచ్చినా వాడికి అన్నంపెట్టకు తెలిసిందా?'

శేషమ్మ ఏమీ మాట్లాడకుండా, గుడ్లనీరు కుక్కుకొంటూ వెళ్ళిపోయింది.

ఈ సంఘటన జరిగిన వారంరోజులకే గోపాలంజేబులో డబ్బులు మాయమయ్యాయి. ఆయన భార్యనుపిలిచి అడిగాడు.

'ఏమో నాకు తెలియదు!' అన్న దామె.

'అయితే ఏమైపోయాయంటావ్ ? రాత్రి పది రూపాయల నోటు ఇందులో పెట్టాను. ఉదయానికల్లా మాయ మయింది. మనింట్లో మన ముగ్గురమూ కాక, నాలుగోమనిషెవరూ లేరుగదా ? ఆ వెధవేడీ ? ఏంచేస్తున్నాడు ?' అన్నాడు గోపాలం !

అప్పుడే నిద్రమంచంమిాంచి లేచి, కళ్ళు నలుము కొంటున్న కృష్ణమూర్తి, తండ్రి కేకలు విని ఉలిక్కిపడ్డాడు. గతరాత్రి పొద్దుపోయిందాకా ఆడినదానితాలూకు బద్ధకం, మంచులా విచ్చిపోయింది. తండ్రి ఎందుకు కేకలేస్తున్నాడో వాడికి తెలియకపోయినా, ఆ కోపగించుకోవడమనేది తనను గురించే అయిఉంటుం దనుకున్నాడు. ఈప్రపంచంలో తండ్రి కోపగించుకొనదగిన జీవి, తనొక్కడేనన్నవిషయం వాడికి తెలుసు.

అంతలోనే తండ్రి అక్కడకు వచ్చాడు. కృష్ణమూర్తి చివాలునలేచి నిలబడ్డాడు. తల్లిగూడా, యేంజరుగుతుందోనని, అక్కడికి వచ్చింది.

'ఆ డబ్బంతా ఏంచేశావురా ?' అన్నాడు తండ్రి.

డబ్బుమాట వింటూనే గోపాలంముఖం ఎలా తెలా పోయింది. ఓక్షణం తల్లి కేసి చూసి 'ఏండబ్బు నాన్నా ? అన్నాడు.

'ఏండబ్బా?' అన్నాడు గోపాలం కోపంతో కంపించి పోతూ. 'ఏండబ్బో నీ కింకా తెలియదుట్రా ?'

'నిజంగా నాకు తెలీదు నాన్నా!'

గోపాలం సాచి కొడుకును కొట్టాడు. కృష్ణమూర్తి ఆ అదుటుకు లుంగలుతిరిగి పడిపోయాడు. దవడ కందిపోయింది. కళ్ళు తిరిగిపోయాయి. లేచి నిలబడేలోపుగానే, గోపాలంవచ్చి వాడిచెయ్యి పుచ్చుకొన్నాడు.

'నిజంచెప్పు. రాత్రి జేబులో పెట్టిన పదిరూపాయలు యేంచేశావ్ ?' అన్నాడు గుడ్లురుముతూ.

'నిజంగా నాకుతెలీదు నాన్నా !' అన్నాడు కృష్ణమూర్తి చొంగలుబడ యేడుస్తూ.

'దొంగవెధవ, దొంగవెధవా అని! తీసినవాడివి తీశానసక, నాకేమీ తెలియదంటావేంరా? ఎవ్వరూతియ్యక పోతే, యేమయిపోతుంది ?' అన్నాడు తండ్రి మరొకటి అంటించి.

కృష్ణమూర్తి ఈ రెండవదెబ్బతో, ఒక్కసారి తండ్రి ముఖంలోకిచూచి, నిలువునా నేలబడిపోయాడు. నోటివెంట, ధారాపాతంగా నెత్తురు కారుతోంది. కళ్ళు మూతలుపడిపోయాయి. కాళ్ళు చేతులూ అదేపనిగా పదినిముషాలపాటు కొట్టుకొని, మనిషి కొయ్యబొమ్మలా అయిపోయాడు. శేషమ్మ లబ్బునమొత్తుకుంటూ, కొడుకుదగ్గర కెళ్ళింది. ఇంత జరిగినా, గోపాలానికి కొడుకుమీద జాలికలగలేదు. ఇదంతా, తన దెబ్బలను తప్పించుకొనేందుకు కొడుకు వేస్తున్న దొంగ వేషంగానే ఆయనకు అనిపించింది. భార్యను పక్కకులాగి, కసితీరినదాకా కొట్టి చెప్పులన్నా తొడుక్కోకుండానే బైటికి వెళ్ళిపోయాడు.

అంతే! ఆనాటినుండి ఈనాటివరకూ మళ్ళీ కృష్ణమూర్తిజాడలేదు. వాడేమయిపోయ్యాడో, యెక్కడున్నాడో గూడా తెలియదు. వాణ్ని తెలుసుకోనేందుగ్గాను గోపాలం ఎన్నో ప్రయత్నాలుచేశాడు. ఆఖరికి విసుగెత్తి మానేశాడు. తనకొడుకు ఇంతటి అఘాత్యానికి సిద్ధపడతాడని గోపాలం ఊహించలేదు. అనేకసార్లు, అనేక విషయాల్లో వాణ్ని తను దండించాడు. వాడుగూడా తనుచేసిన తప్పులను చేసినట్లు అంగీకరించేవాడు. వాడు ఒప్పుకోనిదల్లా, ఆ పదిరూపాయల దొంగతన మొక్కటే! నిజంగా వాడానోటుతియ్యనేలేదేమో? తనే దాన్నెక్కడన్నా పోగొట్టుకొన్నాడేమో! అయినా, అనేక దుష్కార్యాలుచేసిన కొడుకు యెదురుగ్గా ఉండడం చేత, ఈ దొంగతనంగూడా తను వాడికే అంటగట్టాడు. వాడిచేత, నిజం చెప్పించాలనీ, వాణ్ని సన్మార్గంలో పెడదామన్న అభిప్రాయంతోనే, తను వాణ్ని, అంత క్రూరంగా దండించాడు గానీ, వాడిమీద తనకు ప్రేమలేకగాదు. ప్రేమ అనేదిగూడా, ఒక్కోసారి మనిషిచేత రాక్షసకార్యాలు చేయిస్తుంటుంది కాబోలు!

తను ఆశించింది, తన కొడుకు గొప్పవాడు కావాలనీ, తన కింత కీర్తిప్రతిష్ఠలు ఆర్జించాలనీనూ. అందుకోసమే తను వాణ్ని అతిగా దండించాడు. అతిగా కట్టుదిట్టాల్లో పెట్టాలని చూశాడు. తన ఉద్దేశం, వాడు బాగుపడటమే గానీ, చెడిపోవడం మాత్రం కాదు. మానవుడు ఎంతో సద్బుద్ధితో చేసే ఒక్కొపని, ఇంతటి విషఫలిత మిస్తుందని, తనెన్నడూ అనుకోలేదు. దుష్టబీజంనుండి, దుష్టవృక్షం పాదుర్భవించ

డాన్ని తను అర్థంచేసుకొంటాడు. కానీ మంచిబీజంనుండి విష వృక్షం రావడం విడ్డూరం కాదా?

ఏది ఏమైతేనేం, కొడుకును బాగుచేయాలన్న ప్రయత్నంలో, తను వాణ్ణే కోల్పోయాడు. ఇక తన వంశం, తనతోటే అంతరించిపోతుంది. అయినా తనది మరీ చాదస్తం! లోకంలో ఉన్నవారంతా ఉత్తములేనా? దుర్మార్గులు లేనే లేరా? సంఖ్యాబలాన్నిబట్టి చూస్తే, సన్మార్గులకన్న దుర్మార్గులే అధికంగా ఉన్నారు. ఇంతమంది దుష్టులను భరించిన లోకం, తన బిడ్డనుకూడా భరించలేకపోదు. నలుగురూ 'ఫలానా గోపాలంగారి అబ్బాయి' అంటూ వేలు చూపుతారేమోనన్న బాధకొద్దీ, తను వాణ్ని రాచి రంపానపెట్టాడు. తనకీర్తిప్రతిష్ఠలకోసం, తను వాణ్ని సాధనంగా చేసుకొన్నాడు. తన స్వార్థం తనకే తిప్పికొట్టింది.

తన భార్య చనిపోవడానికి కారణం, కొడుకుమీాది మమకారమేనని గోపాలానికి తెలుసు. అయినా దానికి డాక్టర్లు ఇంకేదో పేరుబెట్టారు. చావబొయ్యేముందుగూడా, తన భార్య కొడుకును కలవరిస్తూనే చచ్చిపోయింది. ఏదో చేదామనుకొన్న తను, చివరికి, సర్వనాశనానికి పునాదులు వేశాడు.

తన కొడుకు ఎంత దుష్టుడైనప్పటికీ, వాడిలో ఒక మంచితనం కూడా ఉన్నదని, గోపాలం అనుకొన్నాడు. చేసిన తప్పును, వాడు చేశానని ఒప్పుకుంటాడు. అంటే, ఆ తప్పుకుగాను, తను విధించబొయ్యే శిక్షకుగూడా, వాడు మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాడన్నమాట. అలాంటి కొడుకు-ఆనాడు

ఆ డబ్బు తను తీయలేదని, ఎంతగా చెప్పినప్పటికీ, తను వినిపించు లేదు. ఆ కోపంలో, వాడు నిజం చెబుతున్నాడేమో నన్న అనుమానంకూడా తనకు తట్టలేదు. జీవితంలోని అతి స్వల్ప సంఘటనలు, ఆ జీవితాలను ఎంతగా తారుమారు చేస్తాయో తన కిప్పటికిగానీ తెలియలేదు.

ముష్టి పదిరూపాయలకోసం, తను కొడుకును పోగొట్టుకొన్నాడు. ఈలోగా తనెన్నో పదులు సంపాదించాడు. కానీ. ఆనాడు పోయిన కొడుకునుమాత్రం, తను తిరిగి సంపాదించలేకపోయాడు. ఇప్పటివరకూ వాడు బ్రతికిఉన్నాడన్న నమ్మకం కూడా తనకు లేదు. నిజంగా బ్రతికి ఉంటే ఒక్కసారన్నా తనను చూడడానికి రాకపోతాడా? అనుకొన్నాడు. కానీ, అది నిజం గాదు. తన కొడుకు జీవించే ఉన్నాడు. ఉండటమేకాదు; చాలా ఉన్నతస్థాయిలోకొచ్చాడు. తను ఏది కావాలని రుకొన్నాడో, ఏది కావాలని తన కొడుకును రాచి రంపానపెట్టాడో, తన కొడుకు అదే అయ్యాడు. తనకు తను బాగుపడటమే గాకుండా, తండ్రికికూడా కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించాడు. వాడెంత గొప్పవాడు కాకపోతే, ఎంతటి ఘనుడు కాకపోతే వాడిఫొటోను ఈపత్రికలవాళ్ళు వేస్తారు?

ఇంతకాలమూ, తనకు కొడుకు కనిపించితేనే చాలుననుకొన్నాడు. వాడెంత దుర్మార్గుడైనా, దుష్టుడైనా, తను భరించడానికే సిద్ధపడ్డాడు. ఇప్పుడు కొడుకు కనిపించడమే కాదు; వాడు తన కలలనన్నిటినీ నిజంచేశాడు. ఈవార్త ఆతల్లికి తెలిస్తే ఎంతసంతోషిస్తుందో! ఒకటికాదు, రెండు కాదు, దాదాపు పదిహేను సంవత్సరాలయింది వాడు వెళ్ళి.

ఆనాటి రూపంతో ఈబొమ్మను పోల్చుకుంటే, ఎక్కడా పోలికలందటంలేదు. నిజం! తను భ్రమపడటంలేదు. వీడు తనకొడుకే! ఆ కళ్ళు, కోటేరులాంటి ముక్కూ — తనకు తెలుసు. వాడు తన కొడుకు. సంవత్సరాలు గడవడంచేత, వయస్సు వాడిలో మార్పు తెచ్చిందిగానీ, వాడు తనబిడ్డ కాకపోవడమేమిటి ?

నీరుకమ్ముకున్న కళ్ళతో ఆ బొమ్మకేసి చూసి, గాఢంగా దాన్ని హృదయానికి హత్తుకొన్నాడు గోపాలం.

* * * *

ఏక్షణానికేం జరుగుతుందో ఎవ్వరూ చెప్పలేరు. అలా చెప్పగలిగే సదుపాయ మేదన్నా ఉన్నట్లయితే, సుందరం గారు, ఆ నా డంతటి విపత్కరపరిస్థితిని ఎదుర్కొనవలసి వచ్చేదికాదు. ఆ సంఘటన జరిగి ఇప్పటికి అయిదారేళ్ళు కావస్తున్నది. అయినా, తనింకా దాన్ని మరిచిపోలేదు. ఇక ముందుగూడా తను దాన్ని మరిచిపోలేడు. ఆ వొక్క సంఘటన, తనజీవితపథాన్నే మార్చివేసింది. ఏమచ్చాలేని తనకు, అదొక మచ్చగా పరిణమించింది. ఆసంఘటన తన అభివృద్ధినే కుంటుపరిచింది.

ఆనాడు—తనెన్నో కలలుకన్నాడు. తన సాహసానికి మెచ్చి, ప్రభుత్వం తనకేదో వరగబెడుతుందనుకొన్నాడు. ఎంతో అభివృద్ధిలోకి పోదా మనుకొన్నాడు. ఆ పని, తను

సక్రమంగా నిర్వహించడం ద్వారా అటు జాతీయ నాయకులనూ, ఇటు మంత్రివర్గాన్నీ మెప్పించ వచ్చుననుకొన్నాడు. వారి ఆదరణ సంపాదించడంద్వారా, ఎన్నోపనులు నెర వేర్చుకొందా మనుకొన్నాడు. బంగారుకలలు కన్నాడు. అయితేనేం ? ఏది జరగలేదు. అందుకుగూడా, తను అంతగా విచారించడంలేదు. నిజంగా — త నేది జరగాలనుకొంటున్నాడో, దానికి ఫక్తు వ్యతిరేకం జరిగిపోయింది. దేశం యావత్తూ ఏ ఫలితంకోసం కనిపెట్టుకొని ఉందో, దానికి విరుద్ధమైన ఫలితం కలిగింది.

ఆ రోజుల్లో, ఆ ప్రాంతమంతా, అతగాడి పేరు చెబితే, గడగడలాడిపోతోంది. భాగ్యవంతులు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకొని, ఉండేవారు. ఏక్షణాన ఎవరు చచ్చిపోతారో తెలియదు. ఏ నిమిషాన ఎవరికొంప దోపిడి చెయ్యబడుతుందో, అంతకన్నా తెలియదు. అందులోనూ—వాళ్లు ఒకరూ ఇద్దరూ కాదు. ఎందరుండేవారో, ఖచ్చితమైన అంచనాలేవీ లేకపోయినా, కనీసం వందమందికి తక్కువఉండేవారు కాదనవచ్చు.

దురదృష్టవశాత్తూ ఆ ముఠాలోనివారందరూ ఆరితేరిన ఘటికులు. వా రేది చెయ్యాలంటే, దాన్నిచేసేవారు. వారి దోక పద్ధతిప్రకారం కొనసాగుతుండేది. ఎవరెవరు,ఏయే పనులు చేయవలసిందీ నాయకుడు నిర్ణయిస్తాడు: అనుయాయులు, అతని నిర్ణయాలను, అక్షరాలా పాటించేవారు. అతనిఆజ్ఞ వారికి రామాజ్ఞ... అన్నట్టు-అతని పేరు రామకృష్ణ.

రామకృష్ణపేరు చెబితే, మధ్యప్రదేశ్, తల్లడిల్లి పోయేది. ఎన్నోకొంపలను, అతను నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేశాడు. ఎందరో ధనవంతులను, అతగాడు నిస్సంకోచంగా హతమార్చాడు. చాలా బాంకీలను అతను కొల్లగొట్టాడు. రాష్ట్రాన్ని నానాభీభత్సంచేశాడు.

అతన్ని పట్టుకోవాలని ప్రభుత్వం పోలీసుశాఖకు ఉత్తరువు లిచ్చింది. పోలీసులు ఎన్నోవిధాల ప్రయత్నించారు. ఎన్నో మాయోపాయాలు పన్నారు. కానీ వారివల్ల కాలేదు. కేంద్రప్రభుత్వం, ఆముఠాను పట్టుకోడంకోసం, ప్రత్యేకమైన వ్యక్తులను కొందర్ని నియమించింది. ఈ నియామకం జరిగిన నాలుగువారాలకు, ఆ వ్యక్తులశవాలు, సురక్షితంగా, ఢిల్లీ స్టేషనుకుచేరాయి. ఏమి చెయ్యవలసిందీ తోచని పరిస్థితిలో, రాష్ట్రప్రభుత్వం, సుందరంగారి పేరును కేంద్రానికి సూచించింది.

సుందరంగారు ఆరితేరినఘటం. దొంగల్నిపట్టడంలో, ఆయనకాయనేసాటి. ఆ మధ్య తెలంగాణలో జరిగిన కమ్యూనిస్టుల అల్లరుల సందర్భంలో, హైద్రాబాదు ప్రభుత్వం సోమసుందరంగారిని, ప్రత్యేకంగా తన రాష్ట్రానికి పిలిపించుకొంది. ఆయనగారుగూడా శక్తివంచనలేకుండా పాటుపడ్డారు. కాస్త తలతిక్కగామాట్లాడిన ప్రతివాణ్నీ జైల్లోతోయించాడు. కాంగ్రెసుకాదన్న ప్రతి వెధవనూ, కాల్చిపారేశాడు. ఇళ్ళల్లోదూరి, వాటిని ప్రశాంతంగా ధ్వంసంచేసి, గాఢ శాంతిని స్థాపించాడు. ఆయన అరెస్టుచేసినవాడు 'కమ్యూనిస్టు అభిమాని; ఆయన కాల్చినవాడు కమ్యూ

నిస్తులేదరు. నల్లగొండజిల్లాలో, సుందరంగారి పేరు చెప్తే కొనే స్త్రీలు ఈనాటికీ చాలామంది ఉన్నారు.

ఈ క్రెడిట్ ఆయనగారికి బాగా అక్కరకొచ్చింది. పోలీసుశాఖలో సుందరంగారంటే మాంచి గౌరవం ఏర్పడింది.

ఈ కారణంగానే, మధ్యప్రదేశ్ ప్రభుత్వంఆయన్నుపంపవలసిందిగా, కోరి పిలిపించుకొంది. సుందరంగారు సంతోషంగా దానికి అంగీకరించి, ఒక శుభముహూర్తాన బయలుదేరాడు.

ముందుగా ఏమి చెయ్యవలసిందీ ఆయనకు పాలుపోలేదు. కొన్నిరోజులపాటు, ఒంటరిగా గదిలోకూచుని, భావికార్యక్రిమానికి, రూపురేఖలు దిద్దుకోసాగాడు. ఒకసారి కింది ఆఫీసరు, ఆయనదర్శనంకోసం గదిలోకొచ్చాడు. అక్కడ సుందరంగారు లేరు, ఆయన తాలూకు, సామానుగూడా లేదు. ఆ ఆఫీసరుకు గుండెలు జారిపోయాయి. ఈసంగతిని ప్రభుత్వానికి తెలియపరిచాడు. ప్రభుత్వం అతనికోసం రెండు మూడు నెలలు గాలించి, అతన్ని దొంగలముఠా చంపివేసిందని ప్రకటించింది.

'అవును. ఆ ప్రకటనను నేనూ చూచాను. ప్రభుత్వం నన్నుగురించి పొరబాటుపడినా, అదిచాలా మంచిపనే చేసింది. నేను, తమను పట్టుకోడానికి వచ్చానని తెలిసినప్పటినుండీ, ఆ ముఠా చాలా జాగ్రత్తగా వ్యవహరించసాగింది. వారి ఆచూకీ ఎంతకీ తెలిసిందిగాదు. ఇది లాభం లేదను

కొన్నాను. నేను కనపడకుండా ఉండటమే మంచిదను కొన్నాను. ఒకరోజున చెప్పకుండా బైటకొచ్చేశాను.'

ప్రతివ్యక్తికీ కొన్ని బలహీనతలంటూ వుంటాయి అవేమిటో తెలుసుకొంటే, ఆ వ్యక్తితో వ్యవహరించటం చాలా సులభం. అయితే, ఆ వ్యక్తిలోని బలహీనతలు ఎలా తెలుస్తాయి ? అతన్ని ఎరిగినవారిద్వారా తెలుసుకోవచ్చు లేదా అతన్ని పరిచయంచేసుకోవడం ద్వారా తెలుసుకో వచ్చు.

రామకృష్ణ మానవుడేకానీ, మానవాతీతుడు కాడు. ఈ దృష్ట్యా అతనికీ కొన్ని బలహీనతలంటూ ఉండకపోవు. అవేమిటో తనకు తెలిస్తే - ఆ మీదట ఏమి చెయ్యవలసిందీ తనకు తెలుసు.

ఈ ఉద్దేశంతోనే సుందరం మారువేషం వేసు కొన్నాడు. ఆ వేషం వేసుకోవడం, అతనికి ఎంతగానో అచ్చి వచ్చింది.

ఎంతటి నల్లమబ్బుకైనా, తెల్లనిఅంచుఉండకతప్పదు ఎటువంటి దుర్మార్గునిలోనూ మచ్చుకోసుగుణమంటూఉండక పోదు. అయినా మనం మంచిచెడుగులను సరిగ్గా అంచనాలు కట్టలేం. మనకుమంచిగాఉన్నది, ఇంకొకరికి చెడ్డగాఉంటుంది. ఆఇంకొకరికి మంచిగాఉన్నది, మనకు చెడ్డగానూఉండొచ్చు.

రామకృష్ణ (అతని పూర్తి పేరేమిటో ఎవరికీ తెలీదు) పరమ దుర్మార్గుడన్నమాట నిజమేగానీ, మరి—మహామంచి వాడన్నవారుగూడా లేకపోలేదు. ఈ రెండవమాట అన్న వారు—అతని అనుయాయులుగాదు. అస లతను, ఇంతటి

దారుణకృత్యాలకు ఒడిగట్టడానికి, చాలామంది చాలా కారణాలు చెబుతారు. ఏది ఏమయినప్పటికీ, అతని కుటుంబం, ఒకప్పుడు — ఒకానొక ధనవంతునిచేత సర్వనాశనము చేయబడ్డమాట మాత్రం నిజం! ఆ కక్షతోనే అత నిలా, ధనవంతులందర్నీ ఏరిఏరి తుదముట్టిస్తున్నాడన్న వాదమే, సత్యానికి దగ్గరగా వుంటుంది.

ధనవంతులమీద ఆగ్రహంతోపాటు, బీదవారిపట్ల అపారమైన దయగూడా అతనికున్నట్టు బోలెడన్ని రుజువులున్నాయి. దోపిడిలో వచ్చిన డబ్బులో చాలాభాగం, అతను బీదసాదలకు పంచిపెట్టిన రుజువులూ ఉన్నాయి. ఇందులోని న్యాయాన్యాయాలను గురించి తర్కించ నవసరం లేదు. ఎందుకంటే, అతను — తనకు న్యాయమని తోచిన దాన్నే అతను చేశాడు. అతన్ని ఆశ్రయించి, ఈరకంగా బాగుపడ్డవాళ్ళున్నారు. పేద పలుకులు పలికి, ప్రాణాలు దక్కించుకొన్నవాళ్ళూ ఉన్నారు.

సహజంగా, లేనివారిపట్ల అతనికున్న ఈ దయా గుణాన్ని, సుందరం తన ప్రయోజనంకోసం ఉపయోగపెట్టు కొన్నాడు. తనూ పేదవాడినే నన్నాడు. తనకుటుంబం, ఫలానావాడిచేత నానాబాధలూ అనుభవించిందన్నాడు. ఆ బాధలు భరించలేక, తనవారందరూ చచ్చిపోయారనీ, తనొక్కడే ప్రాణాలతో బ్రతికి బైటపడ్డాననీ చెప్పాడు.

అందులో అనుమానించవలసిందేమీ అతనికి కను పించలేదు. అందుకే సుందరాన్ని చేరదీశాడు. అయితే — ఈ చేరదియ్యట మన్నది, ఎంతటి విషమంగా పరిణమిం

చిందో, ఆఖరుక్షణాన గానీ, ఆ రామకృష్ణ తెలుసుకోలేదు. అతను తెలుసుకొనేసరికి కాళ్ళకు, చేతులకు సంకెళ్ళుపడ్డాయి. కదలడానికి వీల్లేకుండా చుట్టూ కాపలా ఉంచబడ్డది.

అతగాడు చాలా దుఃఖపడుతుంటాడని సుందరం అనుకొన్నాడు. ఆ దుఃఖచ్ఛాయలను చూడాలని, సుందరం మనస్సు ఉవ్విళ్ళూరింది. కానీ అలాటి వేవీ అతనికి కనిపించ లేదు. రైల్లో అతన్ని బేడీలువేసి తీసుకొస్తున్నప్పుడు-జనం తండోప తండాలుగా, ప్రతి స్టేషనులోనూ, అతన్ని చూడ టానికి మూగసాగారు. వారిని అదుపులోపెట్టడం దాదాపు అసంభవమయింది.

అప్పటికీ ఆ పెట్టెలో చాలామంది జనం ఉన్నారు. ప్రతిస్టేషనులోనూ, ఇంకా అందులోకి జనంతోసుకొంటూనే ఉన్నారు.... కొందరు అతన్ని నానాతిట్లూ తిట్టారు. మరి కొందరు మీదిమీదికి పొయ్యారు. వందలాది ప్రజలనుండి అభివందనలందుకోలేక, సుందరం అలిసిపోతున్నాడు.

ఈ సంగతి అప్పటికే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు తెలియచెయ్యబడ్డది. హోంమంత్రిగారు, సుందరాన్ని అభి నందిస్తూ ఓ సుదీర్ఘమయిన ప్రకటనచేశారు...

ఉన్నట్టుండి, ఏదో పెద్ద చప్పుడయింది. వేగంగా పోతున్న రైలు, ఓ పెద్దకుదుపు కుదిపింది. ఏవో బరువైన వస్తువులు పెద్ద చప్పుడుతో, విరిగిపోయాయి. కొన్ని వేల మానవ కంఠాల రోదనధ్వనులు ఒక్కసారి లేచాయి... ఆ తరువాత, అంతా అయోమయం, గందరగోళం, గడి బిడీనూ.

సుందరం కళ్ళు తెరిచి చూసేసరికి, ప్రక్కనే తెల్లటి దుస్తుల్లో నర్సు కనిపించింది. అతనికి కొన్ని క్షణాలు ఏమీ తోచలేదు. అది కలేమో ననుకొంటూ మళ్ళా కళ్ళు మూసుకొన్నాడు. నర్సుఎంతగాచెప్పినా ఆయనగారికి విశ్వాసం కుదరలేదు.

'అయితే ఈ ప్రమాదం ఎలా జరిగింది?' అన్నాడు సుందరం, నర్సు చెప్పిందాన్ని ఇంకా నమ్మలేక.

'మీరు రామకృష్ణను పట్టుకొన్నవార్త అతని ముఠా వారికి తెలిసింది. తమ నాయకుణ్ణి విడిపించడంకోసం వారు రైలును పడగొట్టి ఉంటారు.' అన్నా రొకరు.

'అయితే వాడు-వాడు,' అనిఆయాసపడ్డాడుసుందరం.

'ఏమయ్యాడో తెలియదు. ఆ ప్రమాదంలో చాలా మంది, గుర్తుపట్టటానిక్కూడా లేకుండా నుజ్జునుజ్జయిపోయారు. వారిలో రామకృష్ణ ఉన్నదీ లేనిదీ తెలియదు. వాడుకూడా చచ్చిఉంటే మంచిదే! కానీ బ్రతికిఉంటే మాత్రం...'

సుందరంగారు దాదాపు అయిదారు గంటలదాకా కోలుకోలేదు. కొన్ని నెలలపాటు, ఆయన ప్రజలకు ముఖం చూపించలేకపోయాడు.

ఇది జరిగిన కొంతకాలానికి; ఆయన ఉద్యోగానికి రాజానామా చేశాడు. ప్రభుత్వంకూడా ఎందుచేతో అందు కంగీకరించింది.

ఆ తరువాత రామకృష్ణసంగ తేమయిందో ఎవ్వరికీ తెలియదు. కానీ మధ్యప్రదేశ్‌లో మాత్రం — అలాంటి దోపిడీలు మళ్ళా జరగలేదు. దాన్నిబట్టి అతగాడు ఆ ప్రమా

దంలో మరణించిఉంటాడనే అందరూ అనుకొన్నారు. అయితే, ఇలాంటి నమ్మకం సుందరంగారికి లేదు. ఆయననే దేమిటంటే—ముఠావారి ధ్యేయం, నాయకుణ్ణివిడిపించుకోవడంగానీ, కోల్పోవడంగాదు. అందుకోసం, వారు చాలా గొప్ప సాహసానికి పాల్పడ్డారు. ఆ నాయకునికోసం, ఎంత మందిని నాశనంచెయ్యడానికైనా వెనుకాడలేదు. ఇలా రైలును పడగొట్టినప్పుడు, తమ నాయకునికి ప్రమాదం జరుగుతుందని వారికిమాత్రం తెలీదా? కాబట్టి, వారు అతన్ని తప్పించేఉంటారు. అయితే, మళ్ళా దోపిడీ లెందుకు జరగటంలేదంటారు? దానికి సవా లక్ష కారణాలున్నాయి. ఇక తనపప్పు ఉడకవని అతను గ్రహించడం కావచ్చు. లేదా—ప్రభుత్వం తీసుకొన్న జాగ్రత్తలు కావచ్చు లేదా, మరొకటీ, మరొకటీ కావచ్చు. అంతేగానీ...

సుందరంగారి మాటలను ఎవ్వరూ నమ్మలేదు. అయినా, ఆయనగారు, తనకున్న అభిప్రాయాన్ని మాత్రం మార్చుకోలేదు.

తన అనుమానం ఎంతనిజమో, ఆయనపత్రికచూస్తూనే గ్రహించాడు. ఏవో వార్తలు చూచుకొందామని, పత్రిక విప్పంగానే, ఆ బొమ్మ కంటబడింది. ఆ వెంటనే—ఏదో జ్ఞాపకం అంటబొడిచినట్లయి, సుందరంగారు ఉలిక్కిపడ్డారు. ఎక్కువసేపు బాధపడకుండానే ఆయనగారు, ఆ బొమ్మను పోల్చుకోగలిగాడు. ఆయనకు ముచ్చెమటలుపోశాయి. కాళ్లు చేతులు వణికాయి. నెత్తురు వేగంగాప్రవహించింది. నాలుక తడారిపోయింది. మళ్ళీ మళ్ళీ ఆ బొమ్మకేసి చూశాడు.

సందేహం లేదు, ఈ బొమ్మ వాడిదే. తనకు బాగాగుర్తు. వాడితో, తను చాలాకాలం సన్నిహితంగా మెలిగాడు. వాడితో తను కష్టసుఖా లనుభవించాడు. తను వాణ్ణి గుర్తు పట్టలేకపోవడమేమిటి? అయిదారేళ్ళు గడిచాయి గనుక, మనిషిలో కొన్ని మార్పులున్నమాట నిజమే! అంత మాత్రాన వీడు, గజదొంగ కాకపోడు. దురదృష్టవశాత్తూ, వీణ్ణి తను తప్ప మరొకరెవ్వరూ ఎరుగరు. ఎరిగిన వాడిముఠా వాళ్ళు, వాడే వీడని ఒప్పుకోకపోరు. అయితే, ఆ ముఠా వాళ్ళు, ఇప్పు డెక్కడున్నదీ తనకు తెలియదు.

అయినా తన కివన్నీ ఇప్పు డనవసరం అనుకొన్నాడు సుందరం. తనిప్పుడు ప్రభుత్వోద్యోగికాడు. అతన్ని పట్టించ వలసిన అవసరం తనకులేదు. నిజంగా ఉన్ననాడు వీడు తనకు చిక్కలేదు. వీడివల్ల తను నానారభసా పడవలసివచ్చింది. దక్కవలసిన వేవీ దక్కలేదు. తనకు మనస్థిమితం తప్పింది. ఉద్యోగానికి రాజీనామా పెట్టవలసిన పరిస్థితి కలిగింది. మీదు మిక్కిలి తను రెండుకాళ్ళూ పోగొట్టుకొని కుంటివా డయ్యాడు.

వీడేదో ఘనకార్యం చేశాట్ట. అందుకని వీడిబొమ్మను వేశార్ట. అంటే, మనిషి బాగా మారాడన్నమాట. తను అప్పుడే వీణ్ని గురించి అనుకొన్నాడు—ఈ వెధవ, ఈ దోవ తొక్కకుండా మంచిదోవ తొక్కితే ఎంత బావుండునాలని! అది ఇప్పటికి కానీ జరగలేదు. అంతమాత్రాన వీడు లోగడ చేసిననేరాలు, నేరాలు కాకపోవు. వాటికిగాను, వీణ్ని ఈనాడూ ఉరికంబం ఎక్కించవచ్చు. తను—అయిదారేళ్ళ

కిరిందట, ఎంత కష్టపడ్డా చెయ్యలేని పనిని, ఈనాడు సుల భంగా చెయ్యవచ్చు. ఒకప్పుడు తను కోల్పోయినవాటిని తిరిగి సంపాదించుకోవచ్చు.

క్రితం నిమిషం—తను ప్రభుత్వోద్యోగిని కాననీ, తనకీ బెడదంతా అనవసరమనీ, తను అనుకొన్నట్టు — ఆ క్షణాన సుందరంగారికి జ్ఞాపకంరాలేదు. సుందరమైన భవిష్యత్తు, అతనికళ్ళముందు మెరవడంతో, ఎంతో తృప్తితో ఆ బొమ్మకేసిచూసి, మరుక్షణానే, పట్టరాని ఆగ్రహంతో ఆ బొమ్మమీద కాండ్రించి ఊశాడు సుందరంగారు.

*    *    *    *

ఏ క్షణాని కేం జరుగుతుందో ఎవ్వరూ చెప్పలేరు. అలా చెప్పగలిగే సదుపాయ మేదన్నా ఉన్నట్టయితే, లలిత గతి ఇలా ఉండేది కాదు...

ఒకప్పుడు శివరామయ్య బాగా ఉన్నవాడు. ఆయన తండ్రి ఆటే చదువుకోకపోయినా, మాంఛి వ్యవహర్త. సంవత్సరంలో ఎక్కువభాగం, ఆయన కోర్టుల్లోనే గడిపే వాడు. శివరామయ్య ఎక్కొచ్చేనాటికి చెప్పుకోదగ్గ ఆస్తి పాస్తులేమీ లేవు. అథవా ఉన్నా - వాటికి సరిపడే అప్పు ఉండనే ఉంది.

అయినకాడికి ఉన్న ఇంటిని తెగనమ్మి బాకీలు తీర్చాడు శివరామయ్య. ఆ మిగిలిన డబ్బుతో ఏదన్నా

వ్యాపారం చేదామని ప్రయత్నించాడు గానీ, అది అచ్చి రాలేదు. ఆ సమయంలోనే ఆయనకన్నా దరిద్రుడొకడు, శివరామయ్యకు కన్యాదానంచేశాడు. ఆ తరువాత, తను పెళ్ళాడినందుకు, శివరామయ్య చాలాసార్లు పశ్చాత్తాప పడ్డాడు గానీ, అప్పట్లో భార్యనుచూసి ఎంతైనా సంతోషించాడు. అలాంటి సంతోషమే జీవితాంతం ఉంటుం దను కొన్నాడు. తమ ఇద్దరి జీవితమూ, రంగ రంగ వైభవంగా వెలుగుతుందనుకొన్నాడు. అవన్నీ కేవలం భ్రమలన్న సంగతి గ్రహించడానికి ఆయనకు ఎక్కువకాలం పట్టలేదు. తీరా గ్రహించాక, ఆ జీవితసత్యాలను భరించక తప్పలేదు.

శివరామయ్య జీవితంలోంచి, మంచి రోజులునిష్క్రమించిన మాట నిజమేగానీ, ఇంకా కష్టకాలంమట్టుకు ప్రవేశించలేదు. మంచిరోజులు పోయినందుకే వటవటలాడుతున్న శివరామయ్య, తన కష్టకాలం చూచి హడిలిపోయాడు.

ఈ రెండవదశ ఆయనకు కృష్ణమూర్తి పుట్టడంతో ప్రారంభమయింది. నిజంగా — మునుముకు ముందుపుట్టిన మొగబిడ్డను చూచి, ఎందరో మురుసుకొంటారు. శివ రామయ్య అట్లా అనుకోలేదు. ఇదంతా తన గ్రహచారమనే అనుకొన్నాడు. అంతమాత్రంచేత, ఆయనకు పిల్లలంటే ఇష్టంలేదని అనుకోనవసరంలేదు. ఆ తరువాత రోజుల్లో కృష్ణమూర్తిని ఆయన ఎంత గారాబంగానైనా పెంచాడు మరి! కానీ, అతగాడు పుట్టిన వేళావిశేష మెటువంటిదో గానీ, అప్పుడు శివరామయ్య తలమునగా బాధల్లోవున్నాడు. పట్టుమని పదిరూపాయలొచ్చే ఉద్యోగమంటూ ఏదీలేక,

వేళకు నాలుగుమెతుకులు దొరకడమే బ్రహ్మప్రళయంగా ఉన్న సమయమది. మంత్రసాని కివ్వడానికీ, బారసాల జరిపించడానికీ, శివరామయ్య నానాగడ్డీ కరవ్వాలసివచ్చింది. సానుభూతైతే చాలామంది చూపారుగానీ, సాయపడినవారు మాత్రం లేరు.

కొడుకుపుట్టిన ఆరునెల్లకు శివరామయ్యజీవితం ఒక గాడిన బడ్డది. ప్లీడరుదగ్గిర పన్నెండురూపాయలకు గుమాస్తాగిరి దొరికింది. అప్పట్లో అదే ఆయనకు కామధేనువులా కనిపించింది. ఆ ముహూర్తబల మేమిటోగానీ, చావబొయ్యే దాకా, శివరామయ్య ప్లీడరుగుమాస్తాగానే ఉన్నాడు.

ఈ ఉద్యోగంవల్ల ఆయన వెనకేసి చచ్చిందేమీ లేదు. అయితే భుక్తికిమాత్రం లోటులేకుండా జరుగుతుండేది. అదయినా లలిత పుట్టిందాకానే! లలిత పుటకలకు శివరామయ్య చేతిలో ఏమాత్రమో డబ్బుంది. డబ్బుడబ్బుగా ఉంటే, ఎందునా కాకుండాపోతుందని, ఆయనకు తెలుసు. అందుకే ఆయన పిల్లదానికో పులిగోరూ, సన్నగా వత్తులూ చేయించాడు.

లలితకు ఆ మాత్రమన్నా చేయించాడు. దాని తరవాత పుట్టిన పిల్లలకు ఆయన బారసాలగూడా చెయ్యలేదు. 'ఆఁ, సింగినాదం, పోనిస్తూ' అని ఆయన బుకాయించాడుగానీ, లోపల ఘనంగా చెయ్యాలనేఉంది. కానీ పాపిష్టిడబ్బ—తిండికే సరిగ్గా చాలడంలేదు మరి.

కొందరు కొంద రంటున్నట్టు, శివరామయ్య, వేలకువేలు వెనకేసిందేమీ లేదు. ఆయన తన ఖర్చును ఏనాడూ

బేడనుదాటి పోనివ్వలేదంటే—అందుకు ఆయనఆర్థికస్థితే కారణ మనాలిగానీ, డబ్బు ఆదాచెయ్యాలన్న కాపీనం కారణం కాదు. ఎందుకంటే—ఆయనదగ్గర ఏమాత్రం డబ్బున్నా కృష్ణమూర్తి చదువుచందాలమీద సాగనిచ్చేవాడా? కొడుకు మాసికలేసిన గుడ్డలతో స్కూలుకెడుతుంటే చూస్తూ ఊరుకోనేవాడా? కట్టుకుపోయినంతఉన్నా, కటికదరిద్రం నటించేవాళ్ళు లేకపోలేదుగానీ, శివరామయ్యమాత్రం ఆ కోవకు చెందినవాడు కానేకాదు.

'నేను చేసుకొన్న మహాపాపమేమిటి? నాకీకష్టాలన్నీ ఎందుకుండాలి? నాకన్నా అందరూ సుఖపడుతున్నారు. వాళ్ళలాగా సుఖపడేయోగం నాకెందుకు లేకపోవాలి?' అని శివరామయ్య అనేకసార్లు క్షోభపడిపోయాడు.

ఇంటర్‌దాకా చదివి కృష్ణమూర్తి మానేశాడు. ఎలాగైనా కొడుకుచేత ప్లీడరుబోర్డు కట్టించాలన్న శివరామయ్య కలలు కలలుగానే ఉండిపొయ్యాయి. కొడుకును బాగా చదివించలేకపొయ్యాననే దిగులుతోపాటు, లలితను ఓ ఇంటిదాన్ని చెయ్యాలన్న దిగులు గూడా శివరామయ్యను వేధించసాగింది. ఆయననుకొన్నట్లు—కొడుకు ప్లీడరీచేసి, రెండు చేతులా ఆర్జిస్తున్నట్లయితే, లలిత సంగతీ, ఆ మిగతావారి సంగతీగూడా, ఆయన్నంతగా వేధించకపోను. కానీ, అదేమీ జరగలేదాయె! జరగలేదు గదా అని—కూతురుపెళ్ళి ఆగుతుందా? మిగతా పిల్లల చదువులూ, చట్టుబండలూ ఆగుతయ్యా? ఇప్పటికే లలిత

పెళ్ళీడు దాటుతున్నది. మరో పదేళ్ళకు దానికి పెళ్లి చేస్తేనేం ? చెయ్యకపోతేనేం ?

కూతురుకు మంచి సంబంధాల కోసం, శివరామయ్య చాలా రోజులు చూశాడు. చివరకు ఓ మాదిరి సంబంధాని కైనా సిద్ధపడ్డాడు. కానీ లలితనెత్తిమీద కట్నమనే మూట లేకపోతే దానికి పెళ్ళిచెయ్యటం అసంభవమని నిష్కర్షగా తేలిపోయింది. పోనీ, ఈ కిష్టిగాడికన్నా ఎక్కడైనా ఉద్యోగం దొరుకుతుందేమో ననుకొంటే, అదీ దొరకడం లేదు. అప్పటికీ ఆయన చాలా మందిని ఆశ్రయించాడు. తనకు తెలిసిన నలుగురు పెద్దమనుషులకూ చెప్పి ఉంచాడు. తన పలుకుబడి నంతా ఉపయోగించాడు. శివరామయ్య పిచ్చిగాక పోతే, ప్లీడరుగుమాస్తా ఎంత ? వాడి బిసాదెంత ? వాడికి తోడు ఓ పలుకుబడిగూడానా ?

మృత్యువనేది అన్నింటికీ కడపటి సరిహద్దే అయితే, శివరామయ్య ఆ హద్దును చేరుకొన్నాడు. శివరామయ్య చచ్చిన తరువాత ఆ కుటుంబం పడినబాధలు ఇన్నీఅన్నీ కావు. అంతక్రితంవరకూ ఏవేళకన్నా ఇన్ని మెతుకులుండేవి. ఇప్పుడు వాటికీ కరువయింది.

ఒకసారి కృష్ణమూర్తి తిరిగి తిరిగి ఇంటికొచ్చాడు. కాళ్ళనిండా దుమ్ము పేరుకుపోయివుంది. కళ్ళు గుంటలు పడి ఉన్నాయి. అప్పటికే కడగొట్టు పిల్లలిద్దరూ, అన్న మన్న మని గోలపెడుతున్నారు. వాళ్ళ గోల పడలేక లలిత చేబదులుకు వెళ్ళి వట్టిచేతులతో తిరిగొచ్చింది. అమ్మేదా మన్నా, అమ్మదగిన వస్తువేదీ కొంపలో లేదు. అంతవరకూ,

ఏదో మొండిధైర్యంతో ఉన్న కృష్ణమూర్తి, ఆ క్షణాన బావురుమని ఏడిచాడు. ఆ తరువాత అందరికేసి ఆప్యాయంగా చూసి, బైటికెళ్ళాడు.

వారం తర్వాతగానీ అతను మిలటరీలో చేరాడని వాళ్ళకు తెలియలేదు. తీరా తెలిశాక ఇంటెల్లిపాదీ శోక శోకాలుబెట్టి ఏడిచారు. సంవత్సరంపాటు నెల నెలా వంద రూపాయలు పంపుతూవచ్చాడు. ఆ తరువాత నాలుగైదు నెలలు ఏ కబురూ లేదు. ఆరోనెలలో గావును అతను యుద్ధంలో చనిపోయినట్టు వర్తమానం చేరింది...

ఆ మిగిలిన పిల్లలనూ, ముసలితల్లినీ పోషించాల్సిన భారం లలితమీద ఉన్నది. ఆ భారాన్ని ఆమె సంతోషంతో స్వీకరించింది. ఏమిచ్చినా లేకపోయినా, భగవంతుడామెకు అందాన్నిచ్చాడు. దానితోబాటు అదృష్టాన్నిగూడా ఇచ్చినట్లయితే, లలిత, ఈపాటికి పెద్ద తారామణి అయిఉండును. అదృష్టం లేకపోవడంతో, ఆవిడింకా ఎక్స్ట్రావేషాలే వేస్తున్నది.

ఈ వృత్తివల్ల పొట్ట గడవదు. అదీగాక ఇందులోనూ చాలా చిక్కులున్నాయి. ఈ అవకాశాన్ని ఆసరాగా తీసుకొని, చాలామంది, ఆమెతో 'చనువు' గా ఉండడానికి ప్రయత్నించారు. అందుకామె అభ్యంతరం చెప్పలేదు.

రాత్రి పదిగంటలప్పుడు, తనతో ఏదో 'అర్జంటుపని' ఉన్న 'చనవరి' ఆ పత్రికను అక్కడే వదిలేసి వెళ్ళాడు. లలిత యాదాలాపంగా ఆ పత్రికను తీసింది. అందులోని బొమ్మను చూసి చకితురాలైంది. ఆనందోత్సాహాలు

ఆమెలో పెల్లుబికాయి. సంతోషంతో నోటివెంట మాట రాలేదు. చాలాకాలం క్రిందట చచ్చిపోయాడనుకొన్న తన అన్న, ఇంకా బ్రతికి ఉండటం, ఆమెకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. కాలం గడవడంచేత - ఏవో కొన్ని మార్పులు ముఖంలో కనిపిస్తున్నమాట నిజమే! అంతమాత్రాన?

అంతక్రితంవరకూ, తన దైన్యస్థితికి, విచారిస్తున్న లలిత, ఆ బొమ్మను చూసి ఉత్తేజితురాలై, గబగబా, తల్లి ఉన్న గదికేసి పరుగులెత్తింది.

* · * * *

'అవ్వా! అవ్వా! ఈ కథ అయిపోయినట్లేనా?' అన్నది గువ్వ.

'ఏం? విసుగ్గా ఉందా?' అన్నది అవ్వ.

'అయిపోతే దీనికి 'చతురస్రం' అన్న పేరు బెట్టు. 'కళ్ళజోడు' అన్న పేరు నప్పలేదు' అన్నది గువ్వ, ముక్కును చెట్టుకొమ్మకు రాసుకొంటూ.

'నే నొప్పను.' అన్నది అవ్వ ఖండితంగా.

'ఎంచేత?' అన్నది గువ్వ.

'ఒక్క బొమ్మ ఎందరి కెన్నివిధాల కనిపించిందో విన్నావుగదా?'

'వెనకటికి, ఇలాంటి కథొకటి నేను విన్నట్టు జ్ఞాపకంగా ఉంది.' అన్నది గువ్వ అనుమానిస్తూ.

'అవును. అదీ నేనే చెప్పాను. 'ఏనుగు—ఏడుగురు గుడ్డివాళ్ళు' కథ గదూ?' అన్నది అవ్వ.

'అవును అన్నది గువ్వ రెక్కలుటపటపలాడిస్తూ.